10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం 2 డిసెంబర్ 2024 పేజీలు 8




## కమిషనర్ -టిపిఎస్ కనుసన్నల్లోనే..!

# మల్లంపేట్ అక్రమ కట్టడాలు..!

ప్రమాదకర అక్రమ కట్టడాలకే..మున్సిపల్ అధికారుల ప్రాధాన్యత..

నిర్మాణం ఏదైనా..!ముడుపులు కామన్..! చర్యలకి దూరం..! కనుమరుగైన జవాబుదారీ తనం..

- మల్లంపేట్‌లో కూల్చివేసిన ప్రణీత్ అక్రమ కట్టడంలో యధేచ్చగా పనులు..
- అనుమతులున్న చీటీ రామారావుకు.. "జీరో" సెట్‌బ్యాకులు ముడుపులతో చర్యలకి దూరం..?
- రూ.7.5 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డుకి అడ్డంగా గేటు.. నేటికీ చర్యలు శూన్యం.."
- కమిషనర్ సత్యనారాయణ..! టిపిఎస్ సంజునా..! ఫోన్‌లు ఎత్తరు..! సమాధానం చెప్పరు..!

మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్, దుండిగల్ మున్సిపల్ అధికారులు పేరుకే విధుల నిర్వహణ.. ప్రమాదకర అక్రమ కట్టడాలను పప్రోత్సాహిస్తూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.. కమిషనర్, టిపిఎస్, చైన్‌మెన్ ముగ్గురు ముగ్గురే ఫోన్‌లు ఎత్తరు సమాధానం చెప్పరు.. టౌన్‌ప్లానింగ్ అధికారితో పాటు చైన్‌మెన్ నిత్యం విధుల్లోనే ఉన్నప్పటికీ..! అక్రమ కట్టడాలపై ప్రశ్నిస్తే..! జవాబుదారీగా ఉండాల్సిన ఆ ముగ్గురు బాధ్యతా రహితంగా సమాధానానికి దూరంగా ఉంటారు.. లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఐఏఎస్ అధికారిణి అయినప్పటికీ..! దుండిగల్ మున్సిపాలిటీ లోని అక్రమ కట్టడాలను దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.. స్థానిక దుండిగల్ మున్సిపల్ అధికారులు మాత్రం పైరవీలతో విధుల్లో కొనసాగుతున్నారని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.. అందుకే కమిషన్, టిపిఎస్, ఎలాంటి అక్రమ కట్టడాలైనా ముడుపులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.. పలుకుబడి ఉన్న అధికారులు అయినందున, మరిన్ని ప్రమాదకర అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 1:**

- దుండిగల్ మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా విధుల నిర్వహణ..
- అనుమతుల్లేని ఐదంస్తుల ప్రణీత్ బిల్డర్ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినా..! మళ్ళీ పనులు..
- అనుమతులు తీసుకున్న చీటీ రామారావు ఐదంస్తుల భవనంలో "జీరో" సెట్‌బ్యాకులు..
- కౌన్సిలర్ మాదాసు వెంకన్న రోడ్డుకు అడ్డంగా గేటు నిర్మాణం రెండేళ్ళు పూర్తి..
- డ్రైనేజీ-సీసీరోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు.. రోడ్డుకు అడ్డంగా గేటుపై అధికారుల ఉదాసీనత..
- అధికారులకి ముడుపులు సమర్పించి.. నిబంధనలకు తిలోదకాలు..

-2లో


ఖాజిపల్లి రోడ్డులో ప్రణీత్ బిల్డర్ అక్రమ కట్టడం

## లొంగిపోవాలని చెప్పిన వినలే.. ములుగు ఎన్ కౌంటర్‌పై ఎస్పీ శబరీష్ ప్రకటన



- ఏటూరునాగారం అటవీప్రాంతంలో కాల్పుల మోత
- ఉదయం పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు
- ఏడుగురు నక్సల్స్ మృతి

హైదరాబాద్ పెన్ పవర్:ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని చల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ములుగు ఎన్ కౌంటర్‌పై ఆ జిల్లా ఎస్పీ

-6లో

## కేసీఆర్ రైతు బంధు ఎగ్గొడితే.. మేం వచ్చాక ఇచ్చాం

హైదరాబాద్ పెన్ పవర్:మహబూబ్ నగర్ లో జరిగిన రైతు పండగ వేడుక గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, రైతుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో మరో 9 ఏళ్లు కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలనపై సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలో ఎన్నో గొప్ప నిర్ణయాలు తీసుకున్నాం.. ఏడాది




-6లో

# కమిషనర్-టిపిఎస్ కనుసన్నల్లోనే..! మల్లంపేట్ అక్రమ కట్టడాలు..!




మున్సిపల్ రోడ్డుకు కౌన్సిలర్ గేటు.. పాత ఫోటో..



కౌన్సిలర్ ఇంటికి గేటులోపల సీసీరోడ్డు.. మరో చిత్ర.. పాత ఫోటో..

## జూలై 3న కూల్చివేశారు.. ఇప్పుడు "సిఎంవో" సిఫార్సులట..

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్ మాదాసు కాలనీ కాజీపల్లి వెళ్ళేదారిలో "ప్రణీత్ బిల్డర్స్" సుమారు 500 గజాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, చేపడుతున్న అక్రమ కట్టడాన్ని గత జూలై 3న దుండిగల్ మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణం అంటూ కూల్చివేశారు.. గ్యాస్ కట్టర్లతో స్లాబులను కింద పేడేశారు.. ఇపుడు అదే దృఢత్వం కోల్పోయిన అక్రమ నిర్మాణాన్ని మళ్ళీ నిర్మిస్తుంటే.. దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టిపిఎస్ సంజునా దృష్టికి తీసుకు వెళ్ళినా చర్యలు తీసుకోవడం లేరు.. వార్తలు వచ్చినా చర్యలు తీసుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.. ప్రమాదకర అక్రమ నిర్మాణానికి "ఛీఫ్ మినిస్టర్ పేచీ" నుండి సిఫార్సులు ఉన్నాయని మున్సిపల్ అధికారులు బుకాయించడం గమనార్హం.. సీఎంవో కార్యాలయం నుండి సిఫార్సులు ఉన్నాయని, ప్రశ్నించిన వారికి మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం.. కూల్చివేతల పేరుతో సంబంధిత అధికారులు లక్షల్లో ముడుపులు తీసుకుని, బాధ్యతా రహితంగా సమాధానం ఇవ్వడం విశేషం.. సీఎంవో కార్యాలయం సిఫార్సులు ఉంటే ప్రమాదాలు జరగకుండా చూస్తారా అంటూ ఎద్దేవా చేసేవారు లేకపోలేదు.. ఒకసారి అక్రమం అంటూ కూల్చివేసిన అవే నిర్మాణాలు మళ్ళీ నిర్మించడం వెనుక కమిషనర్, టిపిఎస్, చైన్‌మెన్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి..



మల్లంపేట్‌లో మరో అక్రమ నిర్మాణం.. కాంగ్రెస్ నేత సిఫార్సులు..

ఆతర్వాత ఏమైందో ఏమో కానీ..! సీసీరోడ్డుపై చర్యలకు సమీకరణాలు మారాయి.. అప్పటి ఏఈ గొంతు తడమాడింది.. అవగాహన లేని అధికారుల సమాధానం ఎలా ఉందో మీరే గమనించండి.. అధికారులు, కౌన్సిలర్‌తో కుమ్మక్కై కాంట్రాక్టర్‌కి శఠగోపం పెట్టేందుకు ఓ పథకం పన్నారు.. ఇంకా బిల్లు ఆమోదం పొందలేదని, సిసి రోడ్డు ఖర్చు మొత్తం సంబంధిత కౌన్సిలర్ భరించే విధంగా లెటరు రాస్తున్నట్లు సమాధానం చెబుతూ ప్లేటు పిరాయించారు.. పెన్ పవర్ ప్రతినిధితో ఇదే విషయాన్ని బుకాయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. అలాంటప్పుడు రోడ్డు ప్రతిపాదన మున్సిపాలిటీ ఎందుకు పెట్టింది..? మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణలో ఎలా రోడ్డు వేస్తారు.. మొదటి బిల్లు రూ.2.8 లక్షలు విడుదల అయినట్లు సమాచారం.. మున్సిపాలిటీలో ఎక్కడైనా మూడు ఇళ్ళకు గేటెడ్ కమ్యూనిటీ రేంజ్‌లో ఏర్పాటు, ఏ నిబంధనల ప్రకారం ఇస్తున్నారు..? ఏ అర్హతతో ఇస్తున్నారు.. డెడ్ ఎండ్ రోడ్లకు ఎక్కడి వారు అక్కడే గేట్లు పెట్టుకోవచ్చా కమిషనర్ సారూ.

-

మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్ నిర్లక్ష్యం..! దుండిగల్ మున్సిపల్ అధికారుల బరితెగింపు విధులతో ప్రమాదకర అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారు.. అనుమతులు తీసుకున్నా..! తీసుకోక పోయినా..! అధికారుల చర్యలు ఉండవు.. అదే దుండిగల్ మున్సిపల్ ప్రత్యేకత.. సిఫార్సులతో అక్రమ నిర్మాణాలు, పలుకుబడితో అధికారుల విధుల నిర్వహణ, వెరసి కొనుగోలు దారులకు కట్టబెడుతున్నారు.. భారీ నిర్మాణాలకు అనుమతులు జారీచేసిన మున్సిపల్ అధికారులు..! పర్యవేక్షణ విస్మరించి, సెట్‌బ్యాకులు లేకపోయినా వదిలేస్తున్నారు..మల్లంపేట్ చైన్‌మెన్ సతీష్‌ని అనుమతుల కాపీని ఇవ్వమని ప్రశ్నిస్తే, గోప్యంగాహా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అగ్నిమాపక సిబ్బంది, వాహనం తిరిగే విధంగా.. అనుమతుల్లో నిబంధనలు సూచించిన మున్సిపల్ అధికారులు సంబంధిత నిబంధనల అమలును విస్మరించడం ప్రజలను ప్రమాదంలో పెట్టడమే.. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల భారీ అగ్నిప్రమాదాలు సంభవించినా.. అధికారుల్లో ఏమాత్రం బాధ్యత లేకపోవడం గమనార్హం..



మల్లంపేట్ కేవిఆర్ వ్యాలీలో కమర్షియల్ షెడ్లు.. అధికారుల కనుసన్నల్లోనే..

## ప్రభుత్వ నిధులతో సీసీరోడ్డు.. రోడ్డుకు అడ్డంగా కౌన్సిలర్ గేటు..

దుండిగల్ మున్సిపల్ అధికారులు తప్పుచేసి సమర్థించుకోవడం పరిపాటిగా మారింది.. మల్లంపేటలో 2022లో దుండిగల్ మున్సిపల్ నుండి సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సాంక్షన్ చేశారు.. కాంట్రాక్టర్ రహీమ్ రూ.7.5 లక్షల వ్యయంతో కౌన్సిలర్ మాదాసు వెంకన్న ఇంటివరకు సుమారు 30 మీటర్ల పొడవున, మున్సిపల్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు.. ఆదారి మూడు ఇళ్ళకు మాత్రమే ఉంటుంది. ఆతర్వాత రోడ్డు లేదు.. ఇంతవరకు బాగానే ఉంది.. 2023 ఫిబ్రవరి 24వ తేదిన అదే సిసి రోడ్డుకు, అడ్డంగా స్థానిక కౌన్సిలర్ మాదాసు వెంకన్న గేటును ఏర్పాటు చేశారు.. అదే రోజు స్థానికులు ఫోన్ చేసి పెన్ పవర్ ప్రతినిధికి సమాచారం చేరవేయగా, వెంటనే సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అప్పటి ఏఈ ప్రవీణ్‌కు సమాచారం అందించగా.. రోడ్డు తామే వేశామని సుమారు రూ.7.5 లక్షలు వ్యయంతో నిర్మించామని తెలిపారు.. రోడ్డుకు అడ్డంగా గేటు నిర్మించడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారని, ఏఈతో ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామని రోజులు గడిచినా చర్యలు లేకపోవడంతో, మరోసారి విషయాన్ని ప్రస్తావించగా నోటీసులు జారీచేసి కూల్చివేస్తామని తెలిపారు.. నేటికీ చర్యలు తీసుకోలేదు.. చర్యలు తీసుకోకుండా కమిషనర్ సత్యనారాయణ కూడా ముఖ్యపాత్ర పోషించినట్లు సమాచారం.. ఎంతైనా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అంటే సారుకు అమితమైన ప్రేమ..

## అనుమతులు ఉన్నా..! లేకపోయినా..! నిబంధనలకూ తిలోదకాలు..

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్ ఖాజిపల్లి రోడ్డుకు, సర్వే నెంబర్ 272లో ( "స్టిల్ట్‌౦5") పార్కింగ్ 5 అంతస్తులకు రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్నారు.. అయితే పర్మిషన్‌లో స్పష్టంగా సెట్‌బ్యాకులు మీటర్లలో పేర్కొన్నారు.. స్థలం ఎగుడుదిగుడుగా ఉండటంతో సదరు నిర్మాణ దారుడు సెల్లార్‌గా నిర్మాణం అక్రమంగా చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. మరోవైపు సెట్‌బ్యాకులు కూడా పూర్తిగా లేవని స్పష్టమవుతుంది.. అనుమతుల ప్రకారం "ఫ్రంట్ సైడ్ 7.50 (సుమారు 24ఫీట్లు) మీటర్లు, రేర్ 3.50 (దాదాపు 12 ఫీట్లు) మీటర్లు, సైడ్-1= 3.64 (12 ఫీట్లు) మీటర్లు, సైడ్-2=3.56 (12 ఫీట్లు) మీటర్లుగా పేర్కొన్నారు.. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివాస ప్రజలు తప్పించుకునేందుకు వీలుగా సెట్‌బ్యాకులు ఇస్తారు.. అదేవిధంగా అగ్నిమాపక వాహనాలు తిరిగేలా, సిబ్బంది మంటలు ఆర్పడానికి, ప్రమాదంలో ఉన్నవారిని రక్షించేందుకు ఈ నిబంధనలు పాటించాలని చట్టప్రకారం సూచిస్తారు.. సెట్‌బ్యాకులు లేకపోవడం వలన సదరు నిర్మాణంతో పాటు పక్కనే ఉన్న పలు రెసిడెన్షియల్ భవనాలకు ప్రమాదం చుట్టుకునే అవకాశం ఉంది.. కానీ మల్లంపేట్‌లో ఎక్కడా నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నారు.. సంబంధిత నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, బిల్డర్‌పై కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

# కామ్రేడ్ బాల మల్లేష్ ఆకస్మిక మరణం..

## వామపక్ష ఉద్యమానికి తీరని లోటు సిపిఐ, సిపిఎం ..

## కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శులు ఉమా మహేష్ కీలుకాని లక్ష్మణ్ నివాళులు..



కామ్రేడ్ బాలమల్లేశ్‌కి నివాళులు అర్పించి మౌనం పాటిస్తున్న కామ్రేడ్స్..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 1:** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాల మల్లేష్ ఆకస్మిక మరణం రాష్ట్ర వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు ఉమా మహేష్, కీలుకాని లక్ష్మణ్ అన్నారు.. ఆదివారం ఉదయం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాలు హమాలీ యూనియన్ అడ్డా వద్ద కామ్రేడ్ బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ బాల మల్లేష్ విద్యార్థి ఉద్యమం నుంచి యువజన కార్మిక రాష్ట్ర జాతీయ సంఘాలకు నాయకత్వం వహించి అనతి కాలంలోనే పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎదిగి విద్యార్థి యువ జన కార్మిక పేదల పక్షాన పోరాడినటువంటి వ్యక్తి కామ్రేడ్ బాల మల్లేష్ అని రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూములు గుర్తించి పేదలకు నివాస స్థలం కోసం ఇవ్వాలని పోరాడేనటువంటి వ్యక్తి అని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు, ఈ దేవదానం ఎండి జాకీర్ హుస్సేన్ కరుణాకర్ భాష, దుర్గానాయక్, వీరేష్ సిపిఐ జిల్లా నాయకులు కే.స్వామి హరినాథరావు నరసింహారెడ్డి చంద్రకాంత్, సుంకిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు..

# రైతులకు భారీ గుడ్ న్యూస్.. రైతు భరోసాపై సీఎం రేవంత్ బిగ్ అప్డేట్





**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రైతాంగానికి సీఎం రేవంత్ రెడ్డి భారీ గుడ్ న్యూస్ చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన రైతు భరోసా పథకంపై కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలనపై సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా స్కీమ్ ను కొనసాగిస్తోందని.. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు. రైతు భరోసా స్కీమ్ విధివిధానాల కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ వేశామని.. కమిటీ రిపోర్టుపై శాసన సభలో చర్చించి రైతు భరోసా పథకం గైడ్ లైన్స్ ఖరారు చేస్తామని తెలిపారు. రైతు భరోసా స్కీమ్ అలాగే కొనసాగుతోందని.. ఇందులో ఎవరికీ అనుమానం వద్దని క్లారిటీ ఇచ్చారు. మారీచుడు వచ్చి అడ్డుకున్నా రైతు భరోసా ఆగదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ రూపంలో మారీచులు వస్తారని.. ఎవరూ ఆందోళన చెందవద్దని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఉరి వేస్తే ఉరి అన్నారని.. కానీ వ్యవసాయం దండగ కాదు పండగ చేస్తామన్నారు. కాగా, రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ఏడాదికి ఒక ఎకరానికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

## 'మాలల సింహ గర్జన'లో పాశ్వాన్..





**హైదరాబాద్ పెన్ పవర్:**పరేడ్ గ్రౌండ్స్ లో 'మాలల సింహ గర్జన' సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఈ సభకు తెలంగాణ, ఏపీ నలుమూలల నుంచి మాలలు వేల సంఖ్యలో తరలివచ్చారు. 'మాలల సింహ గర్జన' సభలో ఢిల్లీ నుంచి వచ్చిన పాశ్వాన్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు నిర్ణయంపై మాలలు ఉద్యమిస్తారని తేలిపోయిందని, పార్లమెంట్ లో మాలల గురించి చర్చ జరగాలని చెప్పారు.

బహుజన దళితుల కోసం పోరాటం చేస్తున్నామని, తెలంగాణ, ఏపీలో కాదు ఢిల్లీలో చర్చ జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఢిల్లీ వరకు మాలల పోరాటం చేరితే మోదీ కుర్చీ కదలాలని పాశ్వాన్ నినదించారు. పరేడ్ మైదానం కాదని, పరేడ్ గ్రౌండ్స్ సరిపోక రోడ్డుపై మాలలు నిల్చొని సభను సక్సెస్ చేశారని హర్షం వ్యక్తం చేశారు.మాలలు ఏకం కావడంతో మైదానం సరిపోలేదని, దేశంలోనే ఇంత మంది మాలలు ఒకే చోట చేరడం ఇదే మొదటి సారి అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ మైదానానికి తరలి వచ్చినట్టే ఢిల్లీకి రావాలని, తాము అండగా ఉంటామని పాశ్వాన్ చెప్పారు. మాలల హక్కులను కాలరాసేలా సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని, సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగానే మాలల పోరాటం అని పాశ్వాన్ స్పష్టం చేశారు. మాలలు ఆత్మ బలిదానం కోసం అయినా సిద్ధంగా ఉండే వ్యక్తులని గుర్తుచేశారు. మాలల సంఖ్య ఎంత ఉందో ముందు తేల్చండని, మనం గర్జిస్తే ఢిల్లీలో ప్రధాని సీటు కదలాలని పాశ్వాన్ చేసిన వ్యాఖ్యలు సభకు హాజరైన మాలల్లో జోష్ నింపాయి.

## వచ్చే సీజన్‌కు రూ.500 బోనస్ కంటిన్యూ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రైతులకు సీఎం రేవంత్ రెడ్డి డబుల్ ధమాకా ప్రకటించారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్.. సన్నాలకు రూ.500 బోనస్ పైన కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత సీజన్ లో సన్నాలు పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని.. ఈ బోనస్ వచ్చే సీజన్ కు కూడా కొనసాగిస్తామని రైతులకు శుభవార్త చెప్పారు. తెలంగాణ సోనా, బీపీటీ, హెచ్ఎంటీ లాంటి వంగడాలు వేస్తే పంట ఎక్కువ వస్తుందని నిపుణులు చెబుతున్నారని.. తెలంగాణ ప్రజలు కూడా ఈ రకం బియ్యమే ఎక్కువగా తింటున్నారని.. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పంట వేయాలని సూచించారు. తెలంగాణలో పండిన బియ్యం.. రేషన్ షాపు లలో ఇవ్వలనుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలలో విద్యార్థులకు తెలంగాణలో పండిన బియ్యమే పెట్టాలని భావిస్తున్నామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రైతాంగం సన్నలు పండించాలని సూచిస్తున్నానని పేర్కొన్నారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. సన్న వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో ఇచ్చిన మేరకు ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ రైతుల ఖతాల్లో జమ చేస్తోంది. ఈ క్రమంలోనే సన్నాలకు బోనస్ ను వచ్చే సీజన్ లో కూడా కంటిన్యూ చేస్తామని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రభుత్వం నిర్ణయంతో తెలంగాణ రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

# సవతి కూతురుపై అఘాయిత్యం... 141 ఏళ్ల జైలు శిక్ష!

**హైదరాబాద్ పెన్ పవర్:** మనిషిలో మానవత్వం పాళ్లు విడతల వారీగా తగ్గిపోతున్నాయనే చర్చ గత కొంతకాలంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మనిషి మృగంగా మారుతున్న దశ ఇప్పటికే వచ్చేసిందనే చర్చ ఎప్పటి నుంచో వినిపిస్తుంది. వావి వరసలు మరిచిపోయి, పసి పిల్లల దగ్గర నుంచి పండు ముసలి వాళ్ల వరకూ మృగాళ్ల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో... సవతి కూతురిపై అత్యాచారానికి ఒడిగట్టాడు ఓ మృగాడు. అవును... తన తల్లి ఇంట్లో లేని సమయంలో తన మైనర్ సవతి కుమార్తెపై కన్నేశాడో వ్యక్తి. ఈ క్రమంలో ఆమెపై పదే పదే అత్యాచారం చేశాడు. ఈ ఘటన కేరళలో జరిగింది. ఈ వ్యవహారంపై కోర్టు తీరుపు ఇస్తూ... సదరు నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 141 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మంజేరి ఫాస్ట్



ట్రాక్ స్పెషల్ కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ఫోక్సో చట్టం, ఐపీసీ, జువైనెల్ జస్టిస్ చట్టం కింద వివిధ నేరాలకు గానూ దోషి ఏక కాలంలో ఈ శిక్ష అనుభవించలని జడ్జి జస్టిస్ అష్రాఫ్ నవంబర్ 29వ తేదీన తీర్పు వెలువరించారు. అయితే.. దోషి 40 ఏళ్లు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అతడికి విధించిన శిక్షల్లో ఇదే అత్యధికమని ఆయన ఆ తీర్పులో పేర్కొన్నారు. ఇదే సమయంలో... బాధితురాలికి పరిహారంగా రూ. 7.85 లక్షలు చెల్లించాలని కూడా దోషిని ఆదేశించారు. బాలికపై ఆమె తల్లి ఇంట్లో లేని సమయాల్లో 2017 నుంచి సవతి తండ్రి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. స్నేహితుడి సలహా మేరకు బాలిక చివరకు తన తల్లికి చెప్పిందని.. దీంతో వ్యవహారం వెలుగులోకి వచిందని పేర్కొన్నారు.

# కేసీఆర్ రైతు బంధు ఎగ్గొడితే.. మేం వచ్చాక ఇచ్చాం: సీఎం రేవంత్

**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబ్ నగర్‌లో జరిగిన రైతు పండగ వేడుక గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, రైతుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో మరో 9 ఏళ్లు కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలనపై సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తొలి ఏడాదిలో ఎన్నో గొప్ప నిర్ణయాలు తీసుకున్నాం.. ఏడాది పరిపాలనపై సంతృప్తిగా ఉన్నానని అన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఏ మాత్రం ప్రేమ తగ్గలేదని విషయం రైతు పండగ వేడుకతో స్పష్టమైందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి రూ. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో ఉండే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి రూ. 7 లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి ఉందని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసిందని.. దీనికి మేం అధికారంలోకి వచ్చాక ప్రతి నెల రూ. 6500 కోట్ల వడ్డీ కడుతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఈ విషయాలను ఎప్పుడు



బయటపెట్టలేదని.. మేం అధికారంలోకి రాగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశామని గుర్తు చేశారు. నెలకు వడ్డీనే రూ. 6500 కోట్లు కడుతున్నామంటే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితి ఆగమ్యగోచరంగా ఉన్నా అధైర్య పడకుండా ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు మేలు చేస్తున్నాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ ఎగ్గొట్టిన రైతు బంధు ఇచ్చాం.. విడతలవారీగా రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. మూడు విడతల్లో రూ. 17,869 కోట్లతో 22.22 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని చెప్పారు. నెహ్రూ నుండి వైఎస్ దాకా రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ ఎజెండా.. సాగునీటి ప్రాజెక్టులు, హరిత విప్లవం, ఉచిత విద్యుత్ వంటివన్నీ రైతులు, రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని చేసిన సమూల మార్పులని అన్నారు. ఈ మార్పులతో రైతుల జీవితాల్లో పూర్తిగా వెలుగులు రాలేదని.. ఇందుకోసం రైతులను ఆదుకునే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ మరోసారి చేపట్టిందని తెలిపారు.

## హైదరాబాద్ లో భారీగా గంజాయి

# స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒడిశా నుండి రాష్ట్రానికి కారులో తరలిస్తున్న 57 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. పక్కా సమాచారంతో దాడి చేసిన బాలానగర్ ఎస్ ఓటీ, చందానగర్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు పోలీసులు. గతంలో హర్యానాలోనూ నిందితులపై కేసులు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు చందానగర్ పోలీసులు.

# మాలల సింహ గర్జన: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఆశాస్త్రీయం: డాక్టర్ గోపినాథ్



**హైదరాబాద్ పెన్ పవర్:** అశేష జన సందోహం మధ్య సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మాలల సింహ గర్జన సభ మొదలైంది. ఖమ్మం నుంచి వచ్చిన డాక్టర్ గోపినాథ్ సభలో మాట్లాడుతూ.. సభ కోసం అదానీ, అంబానీ డబ్బులు ఇవ్వలేదని, సొంత ఖర్చులు పెట్టుకుని అంతా తరలివచ్చారని చెప్పారు. సభను బలోపేతం చేసింది వివేక్ వెంకట స్వామి, నాగరాజు అని ఆయన కొనియాడారు.

ఎయిడ్స్ కంటే భయానకం అయిన కులవివక్షపై పోరాటం చేసింది మాలలని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఆశాస్త్రీయం, న్యాయసూత్రాలకు విరుద్ధం అని అభిప్రాయపడ్డారు. దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, క్యాస్ట్ ఫెడరేషన్ వైపు కలిసి అడుగులు వేద్దామని డాక్టర్ గోపీనాథ్ పిలుపునిచ్చారు.

## కూకట్ పల్లి లో ఘోర ప్రమాదం.. ఆర్టీసీ బస్సును ఢీకొని నుజ్జు నుజ్జయిన కారు..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది.. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొని కారు నుజ్జు నుజ్జయిన ఘటన హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ( డిసెంబర్ 1, 2024 ) కూకట్ పల్లి సమీపంలోని వై జంక్షన్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సును వెనుక నుండి ఢీకొని కారు నుజ్జు నుజ్జయ్యింది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో మాలల సింహగర్జన.. భారీ ఏర్పాట్లు..






**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివారం ( డిసెంబర్ 1, 2024 ) జరగనున్న మాలల సింహగర్జనకు భారీ ఏర్పాట్లతో సిద్ధమైంది సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్. ఈ సభకు తెలంగాణ నలుమూలల నుంచి మాలలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. కార్లు,బస్సులు,బైక్ లతో ర్యాలీలుగా సింహగర్జన సభకు తరలివస్తున్నారు. 200మంది అతిథులు కూర్చునేలా వేదిక ఏర్పాటు చేశారు. ఈ సభకు తెలంగాణ, ఏపీ నుంచి పెద్దఎత్తున మాలలు తరలిరానున్నారు. ఈ మీటింగ్ ను విజయవంతం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, మాలమహానాడు ప్రెసిడెంట్ చెన్నయ్య కొన్ని రోజులుగా అన్ని జిల్లాల నేతలతో మీటింగ్ లు నిర్వహిస్తూ ఏర్పాట్లను పరిశీలించారు. మాలలు పెద్ద ఎత్తున హాజరై ఈ సభను విజయవంతం చేయాలని.. ఈ సభ ద్వారా మాలల ఐక్యత చాటి చెప్పాలని పిలుపునిచ్చారు ఎమ్మెల్యే వివేక్. ఇది హక్కుల కోసం నిర్వహిస్తున్న మీటింగ్ తప్ప.. ఎవ్వరికీ వ్యతిరేకం కాదన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మాలల్లో యూనిటీ వచ్చిందని.. రానున్న రోజుల్లో ఐక్యత కొనసాగించాలన్నారు వివేక్ వెంకట స్వామి. రాష్ట్రంలో ఉన్న 30లక్షల మంది మాలలు ఉన్నారని..మీటింగ్ తో తమ సత్తా చూపుతామన్నారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.

# వేములవాడ రాజన్న సన్నిధిలో హీరో శ్రీకాంత్ ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ ప్రముఖ హీరో శ్రీకాంత్ ఈరోజు (ఆదివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఇందులోభాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండితులనుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తర్వాత ఆలయ అధికారులు ఆశీర్వచన మండపంలో శ్రీకాంత్ కి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మీడియాతో మాట్లుడుతూ కార్తీకమాసంలో ఉపవాసాలు ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని దర్శించుకున్నానని తెలిపాడు. మొదటిసారిగా రాజన్న స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రాబోయే తన సినిమాల గురించి మాట్లాడుతూ తాను గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ చేంజర్ సినిమాలో కీలకపాత్రలో నటించానని తెలిపాడు. ఈ సినిమా సంక్రాంతి పండగకి జనవరి 10న రిలీజ్ అవుతోందని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం కళ్యాణ్





రామ్, సాయి దుర్గ తేజ్, తదితర హీరోల సినిమాల్లో నటిస్తున్నానని తెలిపాడు. అలాగే తాను సోలో హీరోగా మరో సినిమాలో నటిస్తున్నానని తెలిపాడు. ఇక తన కుమారుడు రోషన్ గురించి మాట్లాడుతూ ఛాంపియన్ అనే సినిమాలో హీరోగా నటిస్తున్నాడని తెలిపాడు. ఈ సినిమాని ప్రముఖ సినీ నిర్మాత స్వప్న దత్ నిర్మిస్తోంది.

# కూటమికి సవాల్ విసురుతున్న 'యాసిడ్' ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం, గంజాయి సాగు, రవాణా వంటివాటిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇది మంచి పరిణామమే. సాగు కట్టడి జరిగితే తప్ప.. లక్ష్య సాధన సాధ్యం కాదు. ఏజెన్సీలో పెద్ద ఎత్తున సాగవుతున్న గంజాయిని అరికట్టేందుకు.. డ్రోన్ల ద్వారా కూడా ప్రయత్నిస్తు న్నారు. ఇక్, రవాణా విషయంలో అడ్డుకట్ట వేసేందుకు ఎక్కడికక్కడ నిఘా వ్యవస్థను ముమ్మరం చేస్తున్నారు. మొత్తంగా కూటమి బాగానే పనిచేస్తోంది. ఇక, ఇప్పుడు %-%ఈగల్%-% పేరుతో సరికొత్త వ్యవస్థను కూడా రంగంలోకి తీసుకువచ్చింది. ఈ పరిణామాలపై మేధావులు సైతం ముగ్దులు అవుతున్నారు. కానీ, ఇంతలోనే పులిమీద పుట్ర మాదిరిగా.. %-%యాసిడ్%-% ఘటనలు కూటమికి సవాల్‌గా మారాయి. శనివారం ఒక్కరోజే మూడు ఘటనలు జరగడం.. ఈ మూడు ఘటనలకు యాసిడ్‌తో సంబంధాలు ఉండడంతో సర్కారు కలవరపడుతోంది. కక్షలు, ప్రేమ విఫలాలు వంటివి ఈ ఘటనల వెనుక ఉన్నా.. సర్కారుకు ఇబ్బందిగానే మారింది. వాస్తవానికి యాసిడ్ ఘటనలు 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో తరచుగా చోటు చేసుకునేవి. అప్పట్లో యాసిడ్ విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అంతేకాదు.. కొనుగోలు చేసేవారి వివరాల ను కూడా చాలా పెద్ద ఎత్తున నమోదు చేసుకునేవారు. దీంతో అప్పటి నుంచి నిన్న మొన్నటి వరకు కూ డా.. యాసిడ్ దాడులకు అవకాశం లేకుండా పోయింది. కానీ, ఇప్పుడు అనూహ్యంగా యాసిడ్ ఘటనలో చోటు చేసుకోవడంతో సర్కారు ఉలిక్కి పడుతోంది.

ఈ ఘటనల ద్వారా.. అనేక అంశాలపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా శాంతి భద్రతల అంశంపై ప్రబా వం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇప్పుడు చంద్రబాబుకు మరింతగా పని పెరిగిందనే చెప్పాలి. ఉన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సర్కారు ఒకవైపు ప్రయత్నిస్తుంటే.. మరోవైపు ఇలా యాసిడ్ దాడులు చోటు చేసుకోవడంతో చంద్రబాబు ఫీలవుతున్నారు. అయితే.. వీటి వెనుక ఎవరి ప్రోత్సాహం లేకపోవడం ఒక్కటే ఆశాజనకం. వీటిని ఎలా కట్టడి చేయాలన్న విషయంపై సీఎం సోమవారం రివ్యూ పెట్టడం గమనార్హం.

## లొంగిపోవాలని చెప్పిన వినలే.. ములుగు ఎన్ కౌంటర్‌పై ఎస్పీ శబరీష్ ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

శబరీష్ ఆదివారం (డిసెంబర్ 1) కీలక ప్రకటన చేశారు. "వాజేడులో ఇద్దరు అమాయకులను మావోయిస్టులు చంపారు. ఇలాంటి ఘటనలు అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా పెట్రోలింగ్ పెంచాము. ఆదివారం (డిసెంబర్ 1) ఉదయం 6 గంటలకు పెట్రోలింగ్ టీమ్‌కు 10 నుండి 15 మంది మావోయిస్టులు తారసపడ్డారు. పోలీసులను చూసి వాళ్లు కాల్పులు జరిపారు. లొంగిపోవాలని పలుసార్లు హెచ్చరించినా.. కాల్పులు ఆపలేదు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చింది. కాల్పుల తర్వాత సెర్చ్ చేయగా ఏడుగురు చనిపోయినట్లు గుర్తించాం" అని తెలిపారు. మావోయిస్టులు అడవులను వదిలి.. జనజీవన స్రవంతిలో కలవాలని ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ పిలుపునిచ్చారు. మరోవైపు ఎన్ కౌంటర్ నేపథ్యంలో ములుగు జిల్లాలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. కొందరు మావోయిస్టులు పారిపోయారన్న అనుమానంతో జల్లెడ పడుతున్నారు. అనుమానం వచ్చిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. భారీ ఎన్ కౌంటర్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఏజెన్సీ ఏరియాలో పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు.

## కేసీఆర్ రైతు బంధు ఎగ్గొడితే.. మేం వచ్చాక ఇచ్చాం

- మొదటి పేజీ తరువాయి

పరిపాలనపై సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఏ మాత్రం ప్రేమ తగ్గలేదని విషయం రైతు పండగ వేడుకతో స్పష్టమైందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉండే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి ఉందని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని.. దీనికి మేం అధికారంలోకి వచ్చాక ప్రతి నెల రూ.6500 కోట్ల వడ్డీ కడుతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఈ విషయాలను ఎప్పుడు బయటపెట్టలేదని.. మేం అధికారంలోకి రాగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశామని గుర్తు చేశారు. నెలకు వడ్డీనే రూ.6500 కోట్లు కడుతున్నామంటే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితి ఆగమ్యగోచరంగా ఉన్నా అధైర్య పడకుండా ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు మేలు చేస్తున్నాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ ఎగ్గొట్టిన రైతు బంధు ఇచ్చాం.. విడతలవారీగా రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. మూడు విడతల్లో రూ.17,869 కోట్లతో 22.22 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని చెప్పారు. నెహ్రూ నుండి వైఎస్ దాకా రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ ఎజెండా.. సాగునీటి ప్రాజెక్టులు, హరిత విప్లవం, ఉచిత విద్యుత్ వంటివన్నీ రైతులు, రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని చేసిన సమూల మార్పులని అన్నారు. ఈ మార్పులతో రైతుల జీవితాల్లో పూర్తిగా వెలుగులు రాలేదని.. ఇందుకోసం రైతులను ఆదుకునే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ మరోసారి చేపట్టిందని తెలిపారు.

# ప్రపంచాన్ని అప్పుడే వణికిస్తున్న ట్రంప్ ... బ్రిక్స్ వార్నింగ్!



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచానికి పెద్దన్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరటం.. ఈ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఘన విజయాన్ని సాధించటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మరికొన్ని రోజుల్లో అధికారాన్ని చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అదే సమయంలో.. అమెరికా ప్రయోజనాలకు దెబ్బ తగిలే అంశాలపై ఆయన ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లుగా చెప్పాలి. ఈ వాదనకు బలం చేకూరే పరిణామం తాజాగా చోటు చేసుకుంది.అక్టోబరులో నిర్వహించిన బ్రిక్స్ సమావేశంలో.. అందులోని పది సభ్య దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందించే అంశం చర్చకు రావటం తెలిసిందే. ఈ అంశాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ నోటినుంచి రావటం తెలిసిందే. తాజాగా దీనిపై ట్రంప్ స్పందించారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందిస్తే వాటిపై వంద శాతం సుంకం విధిస్తామన్న వార్నింగ్ ఇవ్వటం గమనార్హం.బ్రిక్స్ సభ్య దేశాలు అమెరికా డాలర్ కు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నాయని.. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందించకూడదన్నారు. శక్తివంతమైన అమెరికా డాలర్ కు బదులు మరో కరెన్సీని తీసుకురాకూడదని.. ఒకవేళ అలా చేసేతే ఆయా దేశాల దిగుమతులపై వంద శాతం సుంకం విధిస్తామని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని తీసుకొస్తే.. ఆయా దేశాలు అమెరికాతో వాణిజ్యాన్ని వదులుకోవాలసి వస్తుందన్న హెచ్చరికను చేశారు ట్రంప్. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు ఏ రీతిలో రియాక్టు అవుతాయి? అన్నది ప్రశ్నగా మారింది. రష్యా లోని కజాన్ వేదికగా అక్టోబరులో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ.. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య ఉమ్మడి కరెన్సీ ఉండాలన్న ప్రతిపాదన తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ట్రంప్.. తాజా వార్నింగ్ ఇచ్చారు.

# తుఫాను కారణంగా అదుపుతప్పిన ఇండిగో విమానం..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల వారల్లోకి వస్తోన్న విమానాలకు సంబంధించిన వార్తలు ప్రయాణికులను తెగ టెన్షన్ పెడుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా భారీ వర్షాలు పడినప్పుడు రన్ వేలపై ల్యాండింగ్ సమస్య కు సంబంధించిన ఇష్యూస్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో 'ఫెయింజల్' కారణంగా ఇండిగో విమానం అదుపుతప్పిన ఘటన తెరపైకి వచ్చింది.అవును... బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుఫాను పలు ప్రాంతాలను జలమయం చేసింది. ఈ క్రమంలోనూ దీని ప్రభావం ఏపీలో కనిపించినప్పటికీ.. తమిళనాడులో దీని తీవ్రత ఎక్కువగా ఉందని అంటున్నారు. చాలా ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తిన పరిస్థితి. ఈ సమయంలో చెన్నై ఎయిర్ పోర్ట్ లోనూ నీరు చేరింది.దీంతో... విమానాలు దిగేందుకు, ఎగిరేందుకూ తీవ్ర ఇబ్బం దులు పడ్డాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని గంటలు విమానాశ్రయాలను మూసేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ సమయలోనే చెన్నై ఎయిర్ పోర్ట్ లో ఓ విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వీడి యో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది.ఇందులో భాగంగా... ఇండిగో ఎయిర్ లైన్స్ ఎయిర్ బస్ విమానం చెన్నై ఎయిర్ పోర్ట్ లో ల్యాండ్ అవ్వడానికి ప్రయత్నించింది. అయితే.. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో నియంత్రణ కోల్పోయినట్లు తెలుస్తోంది. దీంతో... మరుక్షణం లోనే తిరిగి గాల్లోకి ఎగిరింది.కాగా... బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను శనివారం సాయం త్రం తమిళనాడు తీరాన్ని తాకింది. ఫలితంగా చెన్నైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తీరం వెంబడి గంటకు 90 కి.మీ. వేగంలో గాలులు వీస్తున్నా యి. అయితే ఆదివారం ఉదయం పరిస్థితులు కాస్త మెరుగుపడటంతో ఇండిగో ఎయిర్ లైన్స్ విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించింది.

# దొంగ బెయిల్ తో జైలు నుంచి జంప్!

**హైదరాబాద్ పెన్ పవర్:**మోసం చేయటం డీఎన్ఏగా మార్చుకున్న ఒక నేరస్తుడి బరితెగింపు తెలంగాణ జైళ్ల శాఖలో సీరియస్ చర్చగా మారింది. అదే సమయంలో జైళ్లను ఇలా కూడా బురిడీ కొట్టొచ్చా? అన్నదిప్పుడు హాట్ టాపిక్ గా మారింది. జైల్లో ఉన్న ఒక నిందితుడు..తనకు గతంలో మరో కేసులో వచ్చిన బెయిల్ పేపర్ ను ట్యాంపరింగ్ చేసి.. సరికొత్త బెయిల్ గా బిల్డప్ ఇచ్చి దర్జాగా జైలు నుంచి విడుదలైన వైనం.. నోట మాట రానివ్వని రీతిలో మారింది. అదే సమయంలో జైల్లోని లోపాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. సంచలనంగా మారిన ఈ ఉదంతంలోకి వెళితే..




హైదరాబాద్ లోని పాతబస్తీకి చెందిన మీర్ సుజాత్ అలీఖాన్ పై పలు కేసులు ఉన్నాయి. చీటింగ్ కేసులో అతను కొద్ది నెలల క్రితం చంచలగూడ జైలుకు వెళ్లాడు. ఆ సందర్భంగా అతనికి అండర్ ట్రయల్ ఖైదీగా 5549 నెంబరును కేటాయించారు. ఈ కేసుకు సంబంధించి అక్టోబరు 17న బెయిల్ మీద బయటకు విడుదలయ్యాడు. కట్ చేస్తే.. నవంబరు 2న నార్సింగ్ పోలీస్ స్టేషన్ లో అతనిపై మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదైంది. దీంతో అతడ్ని అరెస్టు చేసిన పోలీసులు చంచలగూడ జైలుకు తరలించారు. ఈసారి అంతనికి అండర్ ట్రయల్ ఖైదీగా 6687 నెంబరును కేటాయించారు.అయితే.. చంచలగూడ జైల్లో బెయిల్ మంజూరు చేసే శాఖలో పని చేసే మరో నిందితుడు రాముతో లోగుట్టు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. సాధారణంగా జైలు నిబంధనల ప్రకారం కొన్నిపనులు మినహా ఖైదీల చేత పని చేయించకూడదు. కానీ.. చంచలగూడ జైల్లో మాత్రం బెయిల్ విభాగంలో దొంగతనం కేసులో అరెస్టు అయిన విచారణ ఖైదీకి బాధ్యతలు అప్పగించటం షాకింగ్ గా మారింది. దీంతో.. రాముతో ఒప్పందం చేసుకునన సుజ్జాత్ తనకు గతంలో ఇచ్చిన బెయిల్ కాపీని.. మార్ఫింగ్ చేసి సరికొత్త బెయిల్ గా పత్రాన్ని సిద్ధం చేశాడు. తన వారి చేత చంచలగూడ జైలుకు ఆ పత్రాలు వచ్చేలా చేశాడు. వాటిని చూసిన విచారణ ఖైదీ.. అంతా బాగుందంటూ స్టాంప్ వేశాడు. అనంతరం ఇలాంటి వాటిని చెక్ చేయాల్సిన సిబ్బంది రొటీన్ చెకింగ్ చేసి.. అతడికి కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లుగా భావించి.. అతడ్నివిడుదల చేశారు. ఈ పాపం ఎలా బయటకు వచ్చిందన్న విషయంలోకి వెళితే.. సుజ్జాన్ మీద మరో పోలీస్ స్టేషన్ లో ఇంకో కేసు నమోదైంది. దీనికి సంబంధించిన విచారణ కోసం కోర్టు నుంచి పిటీ వారెంట్ తీసుకున్నారు. ఎవరైనా నిందితుడికి బెయిల్ మంజూరు చేసిన తర్వాత పీటీ వారెంట్ ఇష్యూ కాదు. పీటీ వారెంట్ తో జైలుకు వచ్చిన పోలీసులతో ఉలిక్కిపడ్డ చంచలగూడ జైలు అధికారులు.. దొంగబెయిల్ పత్రాలతో విడుదలైనట్లుగా గుర్తించారు. దీంతో.. ఈ అంశం జైళ్లశాఖలో సంచలనంగా మారింది. ఒక దొంగ.. దొంగ బెయిల్ తో జైలు అధికారులకే మస్కా కొట్టేసిన వైనం ఇప్పుడు షాకిచ్చేలా మారింది. దీంతో.. అతడిపై మరో కేసు నమోదు చేసిన పోలీసులు.. అతడ్ని అదుపులోకి తీసుకునేందుకు వెతుకుతున్నారు.

## సీఎం రేవంత్‌కు 'పునరాలోచన' తప్పదా? ఏడాది పాలనలో.. !




**హైదరాబాద్ పెన్ పవర్:**అధికారంలో ఉన్న పార్టీ చాలా జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఏ చిన్న తేడా వచ్చినా.. రివర్స్ అవుతుంది. ముఖ్యంగా విపక్షాలను టార్గెట్ చేసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే.. అవి వికటించే ప్రమాదం కూడా ఉంటుంది. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కట్టడి చేయాలన్నది ఆ పార్టీ ప్లాన్. దీనిని రాజకీయ కోణంలో చూసినప్పుడు తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే.. ఆ ప్లాన్ బెడిసికొడితేనే ఇబ్బంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు.. ఈ తరహాలోనే ఉన్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట. బీఆర్ ఎస్‌పై ఆయన కసితో ఉండొచ్చు. రాజకీయ వైరం మేరకు ఆ పార్టీని కోలుకోకుండా చేయాలని కూడా భావించవచ్చు. కానీ, ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం పెద్దగా ఫలించకపోవడం.. రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రస్తుతం రేవంత్ సర్కారు పాలన ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సమయంలో ఇప్పుడు ఆసక్తిగా మారింది.

1) ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం: ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరమీదికి తెచ్చారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నతాధికారులను వినియోగించి.. ఎన్నికల కు ముందు ఈ తతంగాన్ని నడిపించిందనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద ఎత్తున దీనిపై విచారణ కూడా సాగింది. ఇంకేముందు.. బీఆర్ ఎస్ కీలక నాయకుడు కేటీఆర్ అరెస్టు ఖాయమని అనుకున్నారు. కానీ, ఇప్పటి వరకు కేసు విచారన జరుగుతూనే ఉంది. కేటీఆర్ సేఫ్‌గానే ఉన్నారు.

2) బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు: తద్వారా.. ప్రతిపక్షాన్ని నిలువరించాలన్నది సీఎం రేవంత్ ప్లాన్. ఈ క్రమంలోనే ఇంటికి వెళ్లి మరీ అరిక పూడి గాంధీ వంటివారిని పార్టలో చేర్చుకున్నారు. కానీ, ఇది సొంత పార్టీలోనే బెడిసి కొట్టింది. బీఆర్ ఎస్‌పై సానుభూతి పెంచేలా చేస్తున్నారంటూ.. జీవన్ రెడ్డి వంటి వారు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. మరోవైపు.. కేసులు కూడా కొనసాగుతున్నాయి.

3) హైడ్రా: మూసీ నది ప్రక్షాళన చేయడాన్ని ఎవరూ తప్పుపట్టకపోయినా.. హైడ్రా పేరుతో ఈ ఏడాది జూలైలో తెచ్చిన వ్యవస్థ సాధారణ ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేసింది. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడింది. పడలేదని ప్రభుత్వం చెబుతున్నా.. రియల్ వర్గాలు మాత్రం వెంచర్లు నిలుపుదల చేసుకున్నాయి. పైగా.. ఈ వ్యవహారంలో బీఆర్ ఎస్ నాయకులను హైడ్రా నిలువరించలేక పోయింది.ఇలా.. పలు కీలక అంశాల్లో రేవంత్‌రెడ్డి వేసిన అడుగులు సమీక్షకు గురయ్యాయనే చెప్పాలి. మరి ఆయన ఆత్మ విచారం చేసుకుంటారో లేదో చూడాలి. ఒక్కమాటలో చెప్పాలంటే.. బీఆర్ఎస్‌ను దాని మానాన దానిని వదిలేసి ఉంటే.. వేరేగా ఉండేది. కానీ, వీటిని కెలకడం ద్వారా.. ఆ పార్టీకి అనవసర హైప్ ఇచ్చారన్న చర్చ కూడా సాగుతోంది.

# సంచలన నిర్ణయం... సెక్స్ వర్కర్లకు పెన్షన్!



**హైదరాబాద్ పెన్ పవర్:**భారతదేశంలో సెక్స్ వర్క్ నేరంగా పరిగణిస్తారు! సమ్మతి ఉన్న పెద్దల మధ్య శృంగారం పూర్తిగా చట్టబద్ధమైనదే కానీ.. సెక్స్ వర్క్ ని మాత్రం వృత్తిగా చట్టపరమైన గుర్తింపును కలిగి లేదు! ఇదే సమయంలో సెక్స్ వర్కర్లకు ఎలాంటి హక్కులూ కల్పించబడలేదు. అయితే.. ఈ విషయంలో బెల్జియం మాత్రం ప్రపంచంలోనే మొదటిసారిగా సంచలన నిర్ణయం తీసుకుంది.అవును... బెల్జియన్ సెక్స్ వర్కర్లు ఇకపై పెన్షన్లు, ప్రసూతి సెలవులను అందుకోబోతున్నారు. తాజాగా అక్కడ లైంగిక పనిని కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావడానికి అక్కడ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇదే సమయంలో కార్మికులకు అందే ప్రయోజనాలతో పాటు ఉపాధి ధృవీకరణ పత్రాన్ని సెక్స్ వర్కర్లు అందుకోనున్నారు.

వాస్తవానికి జర్మనీ, నెదర్లాండ్స్, గ్రీస్, టర్కీతో సహా అనేక దేశాల్లో సెక్స్ వర్క్ చట్టబద్ధం చేయబడింది. కానీ.. ఉపాధి హక్కులు, ఒప్పందాలను మాత్రం కల్పించలేదు. దీంతో.. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా బెల్జియం... సెక్స్ వర్కర్లకు పెన్షన్, హెల్త్ ఇన్స్యూరెన్స్, ప్రసూతి సెలవులు వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించనుంది.ఈ కొత్త చట్టం యజమానులను భద్రతా ప్రమాణాలను పాటించాలని, కస్టమర్లను తిరస్కరించే విషయంలో కార్మికుల హక్కులను గౌరవించాలని కూడా ఆదేశించింది. ఈ చర్యలు సెక్స్ వర్కర్లకు సురక్షితమైన పని వాతావరణాన్ని అందించడంతో పాటు ఇతర దేశాలకు ఆదర్శంగా నిలవడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు.ఈ సందర్భంగా స్పందించిన హ్యూమన్ రైట్స్ వాచ్ లో పరిశోధకురాలు ఎరిన్ కిల్ బ్రైడ్.. ఇది ఇప్పటివరకూ ప్రపంచంలో ఎక్కడా చూడని అత్యుత్తమ దశ.. ప్రతీ దేశం ఆ దిశలో పయనించడం తమకు అవసరం అని పేర్కొన్నారు. ఇదే సమయంలో కొత్త చట్టం తమ జీవితాలను మెరుగుపరుస్తుందని స్థానిక సెక్స్ వర్కర్లు అభిప్రాయపడుతున్నారు.

# భారత్ మీద విషం కక్కుతున్న బంగ్లాదేశ్!

**హైదరాబాద్ పెన్ పవర్:**బంగ్లాదేశ్ అన్నది ఈ రోజున ప్రపంచ మ్యాప్ లో ఉంది అంటే దానికి కారణం భారత దేశం. ఆ విషయం రాజకీయాల మీద అవగాహన ఉన్న వారు ఎవరైనా చెబుతారు. పాకిస్తాన్ ఏర్పడ్డాక అందులో తూర్పు పాకిస్తాన్ కి చెందిన వారి పట్ల వివక్ష చూపిస్తున్నారని వారిని అధికార పీఠం మీద కూర్చోనీయకుండా కుట్రలు చేస్తున్నారని ద్వితీయ శ్రేణి పౌరులుగా ట్రీట్ చేస్తున్నారని ఒక పాతికేళ్ల పాటు నలిగిన తరువాత వారు ప్రత్యేక దేశం డిమాండ్ అందుకున్నారు.




అలా డెబ్బై దశకం తొలి నాళ్ళలో పుట్టిన ఉద్యమం కాస్తా పాకిస్తాన్ మీద తూర్పు పాకిస్థాన్ నేతలు యుద్ధం ప్రకటిస్తే వారిని అణచేందుకు పాకిస్తాన్ సహజంగానే తన ప్రయత్నాలను చేసింది. అప్పటికే చాలా వరకూ అణచేస్తూ అన్యాయం చేస్తూంటే తూర్పు పాకిస్థాన్ వారు భారత్ ని మద్దతు కోరిన మీదట నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ భారత జవాన్లను పంపించి పాకిస్తాన్ మీద వీరోచిత యుద్ధాన్ని చేయించారు.ఆనాడు తూర్పు పాకిస్తాన్ వారిని ఆదుకున్నారు. భారత జవాన్లు లాహోరు దాకా వెళ్ళి మరీ పాక్ పీచమణచారు. పాకిస్తాన్ సైన్యాన్ని బంధీలుగా పట్టి తెచ్చారు. పాక్ ని ఓడించి మరీ దారికి తెచ్చారు. అలా ఏర్పడినదే బంగ్లాదేశ్. రెండేళ్ళ క్రితమే యాభై ఏళ్ళు పూర్తి చేసుకున్న బంగ్లాదేశ్ వెనక ఉన్న బలమైన శక్తి భారత్.

ఈ రోజున సర్వ స్వతంత్ర దేశంగా ఉంటూ ప్రపంచంలో తలెత్తుకుని తిరుగుతోంది అంటే దానికి కారణం భారత్. ఆ విధంగా చేయడమే కాదు భారత్ ఆర్ధికంగా ఇతరత్రా బంగ్లాదేశ్ కి చేదోడు వాదోడుగా ఉంటూ ఆ దేశం ఇంతటి స్థాయికి రావడానికి ప్రపంచ స్థాయిలో ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి భారత్ కారణం అన్నది తెలిసిన విషయం.

అలాంటి బంగ్లాదేశ్ ఈ రోజు భారత్ మీద విషం కక్కుతోంది. బంగ్లాదేశ్ లో హిందువుల మీద దాడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అక్కడ టార్గెట్ చేసి మరీ హిందూ లీడర్ల మీద ధార్మిక సంస్థల మీద ఆధ్యాత్మికవేత్తల మీద దాడులు చేస్తున్నారు. వారి బ్యాంక్ అకౌంట్లను స్పందింపచేస్తున్నారు.వారి మీద అన్ని రకాలుగా ఎటాక్ జరుగుతోంది. అయినా సరే బంగ్లా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అక్కడ ప్రస్తుతం ఉన్నది తాత్కాలిక ప్రభుత్వం. దాంతో ఆ ప్రభుత్వం పూర్తిగా పాక్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది అని అంటున్నారు. అంతే కాదు భారత్ ని శతృవుగా చూస్తోంది అన్న మాట ఉంది.అమెరికా కొత్త ప్రెసిడెంట్ గా నెగ్గిన ట్రంప్ సైతం బంగ్లాలో హిందువుల మీద దాడులను ఖండించారు. ఇతర దేశాల వారూ రియాక్ట్ అవుతున్నారు. అయినా సరే బంగ్లాదేశ్ లో మాత్రం అంతకంతకు హిందువుల పరిస్థితి దారుణంగానే ఉంది. వారి మీద జరుగుతున్న దాడుల గురించి బయట ప్రపంచానికి తెలిసింది తక్కువ. అక్కడ జరుగుతున్నదే ఎక్కువ అని అంటున్నారు.ఇదంతా దేని కోసం ఎవరి మెప్పు కోసం అన్న చర్చ సాగుతోంది. మత సామరస్యాన్ని కాపాడుతూ వచ్చిన షేక్ హసీనాను కూలదోసిన శక్తులే ఇపుడు తాత్కాలిక ప్రభుత్వం వెనకాల ఉండి ఆడిస్తున్నాయని వారి అసలు లక్ష్యం భారత్ అని అర్థం అవుతోంది అంటున్నారు. భారత్ బంగ్లాదేశ్ కి ఎపుడూ శతృవు కాదు అన్నది తెలిసిందే. వారి దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకున్నదీ లేదు.

ఎవరు అక్కడ ఉన్నా భారత్ స్నేహ హస్తమే అందిస్తూ వచ్చింది. అలాంటిది భారత్ మీద పగ పెట్టడమేమిటని అంటున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బంగ్లాదేశ్ లో హిందువుల మీద దాడులను ఖండించింది.ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే విడుదల చేసిన ఈ ప్రకటనలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. మైనార్టీలపై దాడుల అంశం మీద అక్కడి ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆరోపించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఇస్కాన్ సంస్థ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని దత్తాత్రేయ హొసబలే డిమాండ్ చేశారు.అంతే కాదు వరసబెట్టి జరుగుతున్న హిందువులపై దౌర్జన్యాన్ని ఆపాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక బంగ్లా దేశంలో మైనార్టీలపై జరుగుతోన్న దాడులను అరికట్టే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగించాలని కోరింది. ఈ దాడుల విషయంలో ప్రపంచ మద్దతు దిశగా చర్యలు చేపట్టాలని సూచించింది.మరో వైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, దేవాలయాలపై దాడులు, భారతీయ జెండాకు అవమానం నేపథ్యంలో ఆ దేశానికి చెందిన రోగులకు చికిత్స చేసేది లేదని కోల్‌కతాలోని జేఎన్ రే ఆసుపత్రి కీలక ప్రకటన చేసిది. బంగ్లాదేశీయులు భారతీయ జెండాను అవమానించారని, అక్కడి హిందువుల పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నందుకు గాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.ఇవన్నీ పక్కన పెడితే బంగ్లాదేశ్ లో హిందువుల దాడుల మీద భారత ప్రభుత్వం ఇప్పటికే ఆ దేశానికి చెప్పాల్సింది చెప్పింది. అయితే మరింతగా కృషి చేయాల్సి ఉందని అంటున్నారు. అంతర్జాతీయ సమాజం మద్దతు కూడా కూడగట్టాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో భారత్ పలుకుబడి పరపతి పెరుగుతున్న నేపథ్యంలో గిట్టని శక్తులు కొన్ని ఈ విధంగా బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని చేయాల్సినవి చేస్తున్నాయని అంటున్నారు. ఏది ఏమైనా భారత్ కి ప్రపంచంలో గౌరవం మన్నన దక్కుతుంటే పొరుగున ఉన్న దేశాలు విషం కక్కుతున్నాయి. ఇది భారత్ దౌత్య నీతితోనే సరైన జవాబు చెప్పాల్సిన అవసరం ఉందని మేధావులు సూచిస్తున్నారు.

# వర్గీకరణ పేరుతో మాల మాదిగల మధ్య ఐక్యత దెబ్బ తీసే కుట్ర: ఎంపీ మల్లు రవి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ జడ్జిమెంట్ పైనే మా మాలల పోరాటమని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో తలపెట్టిన మాలల సింహగర్జన సభకు ఎంపీ మల్లు రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లు లేకుండా చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. షెడ్యూల్ క్యాస్ట్ లను ఆదుకోవాలని అంబేద్కర్ రిజర్వేషన్లు తెచ్చారని.. ఆ రిజర్వేషన్ ఫలాల వల్లే సమాజంలో ఎస్సీలు కొంత ముందుకు వచ్చారని అన్నారు. సమాజంలో కుల వ్యవస్థ మనల్ని ఇంకా వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ ఇచ్చిన హక్కులను తూ.చా. తప్పకుండా పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెక్టార్ లోనే కాకుండా ప్రైవేట్ సెక్టార్ లోనూ రిజర్వేషన్లు ఉండాలన్నారు. మాల, మాదిగ కులాల మధ్య విభేదాలు రాకుండా ఉండాలనే ఈ సభ నిర్వహించామని తెలిపారు. అందరూ కలసి కట్టుగా ఉండాలని.. ఎస్సీల హక్కుల కోసం మాల మాదిగ సంయుక్త పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల మాదిగల మధ్య ఐక్యత దెబ్బ తీసే కుట్ర జరుగుతోందని.. సుప్రీంకోర్టు నిర్ణయం పట్ల మాల మాదిగలు కలసి పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు.